క్లుప్తంగా...

విద్యుత్ ఉండని ప్రాంతాలు

మల్లాపూర్: 33/11 కేవీ నోమా సబ్ స్టేషన్ విద్యుత్ ఫీడర్ పరిధిలో, చెట్ల కొమ్మల తొలగింపు కారణంగా మంగళవారం ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు మైస్టవర పార్క్, శ్రీనివాస్ స్కూల్, ఏపీ కాలనీ, జనప్రియ టౌన్‌షిప్, లింగమయ్య కాలనీలో విద్యుత్ అంతరాయం ఉంటుందని ఏఈ క్రిష్టయ్య తెలిపారు.

నాచారంలో.. నాచారం అవుట్ డోర్ ఫీడర్ పరిధిలోని నాచారం పారిశ్రామిక వాడలోని ఇనెజెట్ ఫీడర్, టెక్ పార్క్, జీవీకే, తెలంగాణ ఫుడ్స్, హర్యానా స్టీల్ ఫీడర్లలో మంగళవారం ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ అంతరాయం ఉంటుందని నాచారం ఏఈ తెలిపారు.

చిట్టీల పేరుతో రూ.కోటికి పైగా కుచ్చుటోపీ

ఉప్పల్: చిట్టీల పేరుతో ఓ వ్యక్తి దాదాపు రూ.కోటికి పైగా అమాయక ప్రజలకు కుచ్చుటోపీ పెట్టి పారిపోయిన ఘటన ఉప్పల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో సోమవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. రామంతాపూర్ యాదయ్య హోటల్ ప్రాంతానికి చెందిన యాదయ్య అలియాస్ యాదగిరి అదే ప్రాంతంలో కొన్ని సంవత్సరాలుగా చిట్టీలను నడుపుతున్నాడు. ఇదే క్రమంలో చిట్టీ ఎత్తుకున్న వారు కొందరు సరిగ్గా డబ్బులు చెల్లించకపోవడంతో తీవ్రంగా నష్టపోయాడు. దీంతో ఎత్తుకున్న వారికి డబ్బులు చెల్లించకుండా మొఖం చాటేస్తుండటంతో బాధితులు ఉప్పల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. రూ.కోటికిపైగా డబ్బులు రావాల్సిందని 50 మంది బాధితులు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

బీజేపీ బలోపేతానికి సమష్టిగా కృషి చేయాలి



మౌలాలి: బీజేపీ బలోపేతానికి సమష్టిగా కృషి చేయాలని వినాక్‌నగర్ డివిజన్ కార్పొరేటర్ కే.రాజ్యలక్ష్మీ అన్నారు. సోమవారం వినాయక్ నగర్‌కు చెందిన అబ్దుల్ ఖదీర్ కార్పొరేటర్ రాజ్యలక్ష్మి ఆధ్వర్యంలో బీజేపీలో చేరారు. ఈ సందర్భంగా పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ రాజ్యలక్ష్మి మాట్లాడుతూ బీజేపీ గెలుపునకు అందరూ కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు ఓంప్రకాష్, ఎస్సీ మోర్చా జిల్లా కార్యదర్శి చైతన్య, ఉపాధ్యక్షుడు శ్రీకాంత్‌యాదవ్, జయమ్మ, కార్యదర్శి గోపాల్, మహిళా మోర్చా అధ్యక్షురాలు సుశీల, లత, కవిత, బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

మోదీకి ధన్యవాదాలు



మేడిపల్లి: భారత ప్రధాని నరేంద్ర మోదీ ఆదివారం తెలంగాణకు వచ్చిన సందర్భంగా శంషాబాద్ విమానాశ్రయంలో మహిళా మోర్చా నాయకులు ఘనంగా స్వాగతం పలికారు. పార్లమెంట్‌లో అత్యధిక మెజార్టీతో చారిత్రాత్మక మహిళా బిల్లు ఆమోదించిన సందర్భంగా పర్వతాపూర్‌వాసి తెలంగాణ రాష్ట్ర మహిళా మోర్చా కోశాధికారి కంజుల సుగుణరెడ్డి ప్రధాని నరేంద్ర మోదీకి కృతజ్ఞతలు తెలిపారు.

బీజేపీ ఆధ్వర్యంలో స్వచ్ఛభారత్



కుషాయిగూడ: గాంధీ జయంతిని పురస్కరించుకొని సోమవారం కుషాయిగూడలో బీజేపీ ఆధ్వర్యంలో స్వచ్ఛ భారత్ నిర్వహించారు. బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి అరవింద్ మీనన్, మాజీ ఎమ్మెల్యే, బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్ హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు. కుషాయిగూడ బస్టాండ్ పరిసర ప్రాంతాలను శుభ్రం చేశారు. బీజేపీ డివిజన్ అధ్యక్షుడు నాదం, నాయకులు కొమ్ము నర్సింగరావు, వెంకటేశ్వర్లు, తాళ్ల ఆనంద్‌గౌడ్, అశోక్, చల్లా ప్రభాకర్, బ్రహ్మచారి, రామకృష్ణ, దయానంద్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఘనంగా బీజేపీ ఎంబీసీ చైర్మన్ జన్మదిన వేడుకలు



మల్లాపూర్: ఉప్పల్ నియోజకవర్గం బీజేపీ ఎంబీసీ చైర్మన్ సంగిశెట్టి రవీంద్రసాగర్ జన్మదిన వేడుకలను మల్లాపూర్‌లో ఘనంగా జరుపుకున్నారు. కార్యక్రమంలో యాదవ సంఘం అధ్యక్షుడు అల్లాడి కృష్ణ యాదవ్, పి.శ్రీనివాస్‌గౌడ్, డాక్టర్ పోచయ్య యాదవ్, కుమార్ యాదవ్, రమేష్, చీనాల శ్రీను, రాసాల శ్రీను, విజయ్‌కుమార్, పెగుడ రమేష్ పాల్గొన్నారు.

రాజీనామాల పర్వం

- మల్కాజిగిరిలో మారుతున్న రాజకీయ సమీకరణలు
- బీఆర్‌ఎస్, కాంగ్రెస్‌లలో మూకుమ్మడి రాజీనామాలు



అల్వాల్‌లో రాజీనామాలు ప్రకటిస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు



అల్వాల్: మల్కాజిగిరి బీఆర్‌ఎస్ సిట్టింగ్ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు పార్టీకి రాజీనామా చేసి కాంగ్రెస్‌లో చేరడంతో బీఆర్‌ఎస్, కాంగ్రెస్ పార్టీల్లో రాజీనామాల పర్వం ప్రారంభమైంది. పార్టీ నాయకులు ఎవరు ఎక్కడికి వెళ్తున్నారో తెలియన పరిస్థితి ఏర్పడింది. బీఆర్‌ఎస్‌లో మైనంపల్లి అనుకూల వర్గం మూకుమ్మడిగా రాజీనామాలు చేశారు. దీంతో పాటు కాంగ్రెస్ పార్టీ టికెట్టు మైనంపల్లి హన్మంతరావుకు ఇవ్వనున్నట్లు సంకేతాలు రావడంతో కాంగ్రెస్ పార్టీ డీసీసీ అధ్యక్షులు నందికంటి శ్రీధర్ రాజీనామా చేశారు. ఆయనతో పాటు పార్టీలో ఉన్న పలువురు నాయకులు రాజీనామాలు చేస్తున్నట్లు ప్రకటించారు. దీంతో రెండు పార్టీల్లో గందరగోళ పరిస్థితి నెలకొంది. బీఆర్‌ఎస్ 10 రోజుల నుంచి పార్టీ క్యాడర్‌ను కాపాడుకోవడానికి తీవ్ర ప్రయత్నాలు చేస్తుండగా కాంగ్రెస్ పార్టీ మాత్రం మైనంపల్లి రాకతో కాంగ్రెస్ బలపడుతుందని ధీమాతో ఉంది. ఈ సమయంలో నందికంటితో పాటు పలువురు కీలక నాయకులు పార్టీలో నుంచి వెళ్లిపోవడంతో పార్టీకి గట్టి షాక్ తగిలింది. బీసీ నాయకుడు పార్టీ నుంచి వెళ్లడం నియోజకవర్గంలో చర్చనీయాంశంగా మారింది. ఇరు పార్టీలు తమ పార్టీ శ్రేణులను కాపాడుకునే ప్రయత్నాలు ప్రారంభించారు. ఏదిఏమైనా వచ్చే ఎన్నికల్లో మల్కాజిగిరిలో రాజకీయ సమీకరణలు రసవత్తరంగా మారనున్నాయి.

మైనంపల్లి వెంటే ఉంటాం..

మల్కాజిగిరి అభివృద్ధికి పాటుపడిన ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు వెంటనే తాము ఉంటామంటూ అల్వాల్ సర్కిల్ పరిధిలోని మచ్చబొల్లారం, వెంకటాపురం, అల్వాల్ డివిజన్లకు బీఆర్‌ఎస్ నాయకులు సోమవారం మూకుమ్మడి రాజీనామాలు చేశారు. సోమవారం అల్వాల్‌లోని పంజాబ్ కమ్యూనిటీ హాల్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో వారి నిర్ణయాన్ని వెల్లడించారు. అనంతరం ఢిల్లీ నుంచి మల్కాజిగిరికి వస్తున్న ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావుకు స్వాగతం పలుకడానికి ర్యాలీగా తరలివెళ్లారు.

బీసీలకు తీరని అన్యాయం

మల్కాజిగిరిలో పార్టీ బలోపేతానికి పనిచేసిన నాయకుడు నందికంటి శ్రీధర్‌ను కాదని కొత్తగా పార్టీలో చేరిన మైనంపల్లికి అవకాశం కల్పించడంపై తీవ్ర నిరసన వ్యక్తం చేస్తూ అల్వాల్ సర్కిల్ పరిధిలోని మూడు డివిజన్లకు చెందిన నాయకులు మూకుమ్మడి రాజీనామాలు చేశారు. పార్టీలో ప్రజాస్వామ్యం లేదని కార్యకర్తల మనోభావాలను పరిగణంలోకి తీసుకొనే నాయకులు కరువయ్యారన్నారు. కొడంగల్‌లో ఓడిపోయిన రేవంత్‌రెడ్డిని మల్కాజిగిరిలో గెలిపిస్తే ఆయనకు పీసీసీ పదవి దక్కిందన్నారు. ఇందుకు బదులుగా ఆయన నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయకపోగా పార్టీ నాయకులను విస్మరించారన్నారు. ఎన్నికల సమయం వచ్చేసరికి కొత్తవారికి పార్టీ టికెట్లు ఇవ్వడానికి నిర్ణయించుకోవడం దురదృష్టకరమన్నారు.

గంగపుత్రులు ఒక్క తాటిపైకి రావాలి

ఉప్పల్: ఉప్పల్ భగాయత్ గంగపుత్ర ఆత్మగౌరవ స్థలంలో సోమవారం ఒకే జాతి– ఒకే సంఘం నినాదంతో నవంబర్ 21న అంతర్జాతీయ మత్స్యకారుల దినోత్సవం సందర్భంగా నిర్వహించ తలపెట్టిన సన్నాహక సమావేశం జరిగింది. కార్యక్రమానికి సంఘం రాష్ట్ర నాయకులు మంగిళిపల్లి శంకర్, తవిత బోయిన గిరిబాబు, పూల బాలకిషన్, కొప్పు పద్మ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గంగపుత్రులంతా ఐక్యంగా తమ డిమాండ్లను సాధించుకోవాలని సూచించారు. గంగపుత్రులు విచ్ఛిన్నం కాకుండా ఏకతాటిపై ఉండి సమస్యలను సాధించుకోవాలని సూచించారు. కొందరు వ్యక్తులు వివిధ రాజకీయ పార్టీలకు తొత్తులుగా మారి సంఘాన్ని విచ్ఛిన్నం చేయడానికి కుట్రలు చేస్తున్న వారిపట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్యక్రమానికి వివిధ జిల్లాల నుంచి గంగపుత్ర సంఘం ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



ఉప్పల్ భగాయత్ గంగపుత్ర ఆత్మగౌరవ స్థలంలో వివిధ జిల్లాల ప్రతినిధులు

ఏఐఎస్ఎఫ్ జాతీయ కార్యవర్గ సభ్యుడిగా పుట్ట లక్ష్మణ్



మేడిపల్లి: ఏఐఎస్ఎఫ్ జాతీయ 30వ మహాసభలు బీహార్ రాష్ట్రం బేగుసరాయిలో 28 నుంచి అక్టోబర్ 1 వరకు సభలు జరిగాయని పుట్ట లక్ష్మణ్ తెలిపారు. బీహార్ బేగుసరాయిలో జరిగిన మహాసభలో జాతీయ కార్యవర్గ సభ్యుడిగా ఎన్నికైనట్లు సోమవారం ఓ ప్రకటనలో ఆయన తెలిపారు.

బీసీలకే మల్కాజిగిరి అసెంబ్లీ టికెట్టు కేటాయించాలి



మల్కాజిగిరి: మల్కాజిగిరి అసెంబ్లీ నియోజకవర్గం టికెట్టు బీసీలకే కేటాయించాలని మల్కాజిగిరి బీసీ ఐక్యవేదిక డిమాండ్ చేసింది. సోమవారం గాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించిన ఐక్యవేదిక ప్రతినిధి మండల రాధాకృష్ణయాదవ్ మాట్లాడుతూ అన్ని రాజకీయ పార్టీలు బీసీ ఓటర్లను ఓటు బ్యాంక్‌గా ఉపయోగించుకుంటున్నాయే తప్ప వారికి న్యాయం చేయడం లేదన్నారు. సుమారు 45 శాతం బీసీ ఓటర్లు మల్కాజిగిర నియోజకవర్గంలో ఉన్నారని రాబోయే ఎన్నికల్లో బీసీలకు కేటాయించకపోతే, స్వతంత్ర అభ్యర్థిగా బీసీ ఐక్యవేదిక నుంచి అభ్యర్థిని పోటీలో నిలబెడతామన్నారు. పలు పార్టీల నాయకులు, కార్యకర్తలు, బీసీ కుల సంఘాల నాయకులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరికీ వైద్య సేవలు అందాలి

బోడుప్పల్: సమాజంలో ప్రతి ఒక్కరికీ వైద్య సేవలు అందాలని 19వ డివిజన్ కార్పొరేటర్ సామల పవన్‌రెడ్డి అన్నారు. బోడుప్పల్ బృందావన్ కాలనీలోని జేజీఆర్ ఉన్నత పాఠశాల, ఆశ్రయం హ్యాండ్ ఆఫ్ హోప్ సంయుక్త ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద, మధ్య తరగతి ప్రజలను దృష్టిలో ఉంచుకుని తరచూ వైద్య శిబిరాలు నిర్వహించాలన్నారు. వైద్య శిబిరంలో రక్త పరీక్షలు, బీపీ, షుగర్, ఎక్స్‌రే, ఈసీజీ, కంటి పరీక్షలు, దంత పరీక్షలు, పక్షవాతం, దమ్ము, దగ్గు, వెన్నుముక సమస్యలు, ఊపిరితిత్తుల సమస్యలు, కిడ్నీ సంబంధ వ్యాధులకు సంబంధించి వైద్య పరీక్షలు నిర్వహించినట్లు వెల్లడించారు. అనంతరం ఉచితంగా మందులు, కంటి అద్దాలను అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ గంగరాజు, హ్యాండ్ ఆఫ్ హోప్ ఆర్గనైజేషన్ ఇన్‌చార్జి రిచర్డ్, జవహర్ కెనడీ తదితరులు పాల్గొన్నారు.



వైద్య పరీక్షలు చేయించుకుంటున్న మహిళలు



గాంధీజీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న బోడుప్పల్ మేయర్ సామల బుచ్చిరెడ్డి



సోనియాగాంధీనగర్‌లో బీఆర్‌ఎస్ ఉప్పల్ అభ్యర్థి బండారి లక్ష్మారెడ్డి, కార్పొరేటర్ శ్రీదేవి



ఈస్ట్ ఇందిరానెహ్రూనగర్‌లో నివాళులర్పిస్తున్న బీఆర్‌ఎస్ నేత మర్రి రాజశేఖర్‌రెడ్డి

మహాత్ముడికి ఘన నివాళి

సూర్యుడు అస్తమించని బ్రిటీష్ సామ్రాజ్యాన్ని గడగడలాడించి, భరతమాత దాస్యశృంఖలాల నుంచి విముక్తి కలిగించిన మహోన్నతుడు మహాత్మా గాంధీ అని నేతలు కొనియాడారు. సోమవారం నియోజకవర్గంలో గాంధీ జయంతిని వాడవాడలా ఘనంగా నిర్వహించారు. వివిధ పార్టీల నేతలు జయంతి వేడుకల్లో పాల్గొన్నారు.



ఉప్పల్ జీహెచ్ఎంసీ కార్యాలయ ఆవరణలో ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి తదితరులు



ఉప్పల్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో నివాళులర్పిస్తున్న నేతలు



హెచ్‌బీకాలనీలో సీపీఐ నేతలు వీఎస్ బోస్ తదితరులు



కాంగ్రెస్ నాచారం డివిజన్ అధ్యక్షుడు వీఎస్ ప్రకాష్‌రెడ్డి



నాచారంలో నాచారం కార్పొరేటర్ శాంతి సాయిజెన్‌శేఖర్



ఆదర్శనగర్‌లో కార్పొరేటర్ బన్నాల గీత తదితరులు

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

కుషాయిగూడ: సీజనల్ వ్యాధుల పట్ల వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని కార్పొరేటర్ ప్రభుదాస్ సూచించారు. సోమవారం ఆయన హెచ్‌బీకాలనీ వార్డు కార్యాలయంలో వైద్య ఆరోగ్యశాఖ సిబ్బందితో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. మలేరియా, డెంగీ వంటి వ్యాధుల బారిన పడ్డ వారిని గుర్తించి సమీప బస్తీ దవాఖానాలను తరలించి వైద్యం అందేలా చూడాలన్నారు. గర్భిణులకు ప్రభుత్వం అందజేసే న్యూట్రీషన్ కిట్‌లను అందజేయాలన్నారు. గ్రౌండ్‌స్థాయిలో ఆశావర్కర్లు పనితీరే కీలకమన్నారు. సమష్టిగా విధులు నిర్వహించి సీజనల్ వ్యాధులను కట్టడి చేయాలన్నారు.



మాట్లాడుతున్న కార్పొరేటర్ ప్రభుదాస్

కాంగ్రెస్ పార్టీ గెలుపు కోసం కృషి చేద్దాం

బోడుప్పల్: కార్యకర్తలు, నాయకులు ఐక్యంగా ఉండి కాంగ్రెస్ గెలుపు కోసం కృషి చేద్దామని బోడుప్పల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పోగుల నర్సింహారెడ్డి అన్నారు. బోడుప్పల్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో సోమవారం జరిగిన కార్యకర్తల సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గడప గడపకు ప్రచారం నిర్వహించి మేడ్చల్ నియోజకవర్గ అభ్యర్థిని భారీ మెజార్టీతో గెలిపిద్దామన్నారు. కాంగ్రెస్‌లో చేరిన మాజీ వార్డు సభ్యులు బొమ్మక్ రమేష్, మాజీ ఎంపీటీసీ సభ్యులు దేవరకొండ వీరాచారి, తోటకూర అశోక్‌యాదవ్, సీనియర్ నాయకులు బొమ్మక్ శ్రీనివాస్, పులకండ్ల శ్రీనివాస్‌రెడ్డిని సత్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ స్థానిక నేత తోటకూర వజ్రేష్‌యాదవ్‌కు టిక్కెట్ ఇస్తే గెలిపించుకుందామని పిలుపునిచ్చారు. స్థానికంగా ఎల్లప్పుడూ అందుబాటులో ఉండే వ్యక్తే మనకు కావాలన్నారు. బోడుప్పల్ ప్రధాన కార్యదర్శి కొత్త ప్రభాకర్‌గౌడ్, మేడ్చల్ బీ బ్లాక్ ప్రధాన కార్యదర్శి కొత్త కిశోర్‌గౌడ్, రాష్ట్ర యూత్ ప్రధాన కార్యదర్శి పొన్నం తరుణ్‌గౌడ్, కార్పొరేటర్ తోటకూర అజయ్‌యాదవ్, నేతలు బాలరాజ్‌గౌడ్, ఆకుతోట గీతారెడ్డి, రాపోలు శంకరయ్య, కుర్రి శివశంకర్, వెంకటేశ్‌గుప్తా, విశ్వంగుప్తా, దిలీప్‌రెడ్డి, హరినాథ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న నేతలు

ఉప్పల్ నాదే..

కాంగ్రెస్ సీనియర్ నేత రాగిడి లక్ష్మారెడ్డి

కాప్రా: కాంగ్రెస్ పార్టీ ఉప్పల్ నియోజకవర్గం అభ్యర్థిగా అధిష్టానం తననే ప్రకటిస్తుందని ధీమా వ్యక్తం చేశారు ఆ పార్టీ నాయకులు రాగిడి లక్ష్మారెడ్డి. గాంధీ జయంతి సందర్భంగా కాప్రా సర్కిల్ కార్యాలయం ఆవరణలోని గాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో చిట్‌చాట్ చేస్తూ.. ఈ సారి రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీదే అధికారమని.. ఉప్పల్ టికెట్ తనకు వస్తుందన్నారు. టీపీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి ఉప్పల్ నియోజకవర్గం నుంచి పోటీ చేసే అవకాశాలు ఉన్నాయనే ప్రచారంపై ఆయనను అడగ్గా రేవంత్‌రెడ్డి ఇక్కడి నుంచి పోటీ చేస్తే అంతకన్నా సంతోషం మరొకటి లేదని.. స్వచ్ఛందంగా తాను తప్పుకుని తమ అధినేత రేవంత్‌రెడ్డికి సంపూర్ణ మద్దతుతో గెలిపించుకుంటామన్నారు. ఎలాగో వచ్చేది కాంగ్రెస్ ప్రభుత్వమే కావున తనను కడుపులో పెట్టుకుని పార్టీ చూసుకుంటుందని ఆశాభావం వ్యక్తం చేశారు. రేవంత్‌రెడ్డి ఉప్పల్‌కు వచ్చే అవకాశం కనిపించడంలేదని, వస్తే మాత్రం తనకంటే సంతోషం వ్యక్తం చేసేవారు మరొకరు ఉండరన్నారు. ఉప్పల్ టికెట్ తనకే వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. నియోజకవర్గంలో ఎలాంటి వర్గవిభేదాలు లేకుండా కాంగ్రెస్ పార్టీ జెండా ఎగరవేయడమే తన లక్ష్యమన్నారు. అతి త్వరలో ఉప్పల్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీలోకి భారీగా చేరికలు ఉంటాయని, ఓ మాజీ కార్పొరేటర్‌తో పాటు ఇంకొందరు పెద్ద నాయకులు కూడా వచ్చే అవకాశాలున్నట్లు రాగిడి లక్ష్మారెడ్డి మీడియాతో అన్నారు.

కేసీఆర్ అభివృద్ధి పనులను వివరించండి



మాట్లాడుతున్న మర్రి రాజశేఖర్‌రెడ్డి, కార్పొరేటర్లు

అల్వాల్: మాజీ ఎమ్మెల్యే చింతల కనకారెడ్డి నివాసంలో బీఆర్‌ఎస్ కార్యకర్తల సమావేశం అల్వాల్ డివిజన్ కార్పొరేటర్ చింతల శాంతి శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో జరిగింది. బీఆర్‌ఎస్ నేత మర్రి రాజశేఖర్‌రెడ్డి హాజరై గాంధీ చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేసీఆర్ చేసిన అభివృద్ధి పథకాలను ప్రజలకు వివరించి బీఆర్‌ఎస్‌ను అధికారంలోకి తీసుకురావాలని కోరారు. వెంకటాపురం డివిజన్ కార్పొరేటర్ సబితకిషోర్, నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, అనిల్‌కిషోర్, సత్యనారాయణ, వీఎస్.రాజు, రాజేందర్, శోభన్‌బాబు, ప్రేమ్‌కుమార్, రాజేష్‌గౌడ్, జాము మహేందర్, సంతోష్, మోసీన్, నిర్మలరెడ్డి, మాధవి పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌ను గెలిపించాలి

మల్కాజిగిరి: రాబోయే ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌ను గెలిపించాలని మర్రి రాజశేఖర్‌రెడ్డి సూచించారు. మాజీ కార్పొరేటర్ జగదీశ్‌గౌడ్ ఆధ్వర్యంలో ఆర్.కె.నగర్‌లో ఆత్మీయ సమ్మేళనం జరిగింది. కేసీఆర్ ఆధ్వర్యంలో రాష్ట్రం అభివృద్ధి పథంలో నడిచిందన్నారు. డివిజన్ పార్టీ అధ్యక్షుడు నర్సింగరావు, వీరేశం యాదవ్, గాలికర్ రవీందర్, జయశ్రీ పాల్గొన్నారు.

డబుల్ ఇళ్ల కేటాయింపులో అవినీతి, అక్రమాలు

అల్వాల్: రాష్ట్రంలో పేదలకు డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు, గృహలక్ష్మి కేటాయింపులో జరుగుతున్న అవినీతి, అక్రమాలపై సమగ్ర న్యాయ విచారణ జరిపించాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఎస్.బాలమల్లేష్ డిమాండ్ చేశారు. అర్హులైన పేదలకు పథకాలను సక్రమంగా ఇవ్వాలని, సంక్షేమ పథకాల్లో జరుగుతున్న అవినీతి, అక్రమాలను అరికట్టాలని నిరాహార దీక్షలు చేపట్టారు. సోమవారం అల్వాల్‌లోని ఈ సేవ కేంద్రం వద్ద ఆయన మాట్లాడుతూ డబుల్ బెడ్ రూమ్స్ కేటాయింపులో లంచాలు తీసుకొని అనర్హులకు కేటాయిస్తున్నారని, పెద్ద ఎత్తున అవినీతి జరుగుతోందని రెవెన్యూ అధికారులు, మున్సిపల్ అధికారులు పట్టించుకోకపోవడం శోచనీయమన్నారు. ఇంటి స్థలం ఉన్న వాళ్లకు సైతం రెవెన్యూ మున్సిపల్ అధికారులు గృహలక్ష్మి కింద ఇచ్చే రూ.3 లక్షలను ఇవ్వకుండా అనర్హులకు కేటాయిస్తున్నారని విమర్శించారు. సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు రొయ్యల కృష్ణమూర్తి, అల్వాల్ మండల కార్యదర్శి కె.సహదేవ్, సహాయ కార్యదర్శులు సల్మాన్‌బేగ్, పి.చంద్రయ్య, డి.జంగయ్య, బి.నరేంద్రచారి, కే.రవిచంద్రన్, ఇమ్రాన్, వై.వెంకటేష్, ఎండీ కరీం, ఖాజా తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యం

ఎమ్మెల్యే భేతి సుభాష్‌రెడ్డి

రామంతాపూర్: పరిసరాల పరిశుభ్రతతోనే అందరూ ఆరోగ్యవంతులుగా ఉండవచ్చని ఉప్పల్ ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి అన్నారు. సోమవారం రామంతాపూర్ వార్డు కార్యాలయంలో జీహెచ్ఎంసీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఆయుష్మాన్ భవ వార్డు సభ కార్యక్రమంలో కార్పొరేటర్ బండారు శ్రీవాణి వెంకట్‌రావుతో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం వాతావరణ మార్పుల వల్ల డెంగ్యూ, మలేరియా వంటి విషజ్వరాలే కాకుండా అంటు వ్యాధులు ప్రబలుతున్నాయని, జాగ్రత్తల గురించి ఆరోగ్య వైద్య శాఖ అధికారులు ప్రజలకు అవగాహన కల్పించాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది ప్రకాష్, గొంగడయ్య, ఆశ వర్కర్లతో పాటు బీఆర్‌ఎస్ నేతలు సుధాకర్, వెంకటేశ్వర్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, ముస్తాక్, శివ, నవీన్‌రెడ్డి, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి

మల్కాజిగిరి: జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని మల్కాజిగిరి ప్రెస్‌క్లబ్ 518 ఆధ్వర్యంలో నిరసన తెలియజేశారు. అధ్యక్ష, కార్యదర్శులు బాలరాజు, విశాల్‌యాదవ్ మాట్లాడుతూ రాష్ట్రంలో జర్నలిస్టులకు ఇళ్ల స్థలాల కేటాయింపులో ప్రభుత్వం విఫలమైందన్నారు. కేంద్ర ప్రభుత్వం రైల్వే పాస్ రాయితీని పునఃరుద్ధరించాలన్నారు. భిక్షపతి, సునీల్‌రెడ్డి, మల్లేష్, మోహన్‌రావు, రహమాన్, పవన్, లవకుమార్, సంఘమేష్, మహేందర్, సుధాకర్, మనోహర్, సత్య, నాగరాజు, రవియాదవ్, రాజు తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్టుల ర్యాలీ

కాప్రా: జర్నలిస్టుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ గాంధీ జయంతి సందర్భంగా కాప్రా సర్కిల్ పరిధిలోని జర్నలిస్టులు ర్యాలీ నిర్వహించారు. ప్రభుత్వం తక్షణమే మీడియా కమిషన్ ఏర్పాటు చేయాలని, జర్నలిస్టులకు రైల్వే పాస్‌లు పునరుద్ధరించాలని, ఇళ్ల స్థలాలు కేటాయించాలని డిమాండ్ చేస్తూ టీయూడబ్ల్యూజే ఆధ్వర్యంలో ఈసీఐఎల్ చౌరస్తా నుంచి కాప్రా సర్కిల్ కార్యాలయం వరకు ర్యాలీగా వెళ్లారు. సర్కిల్ కార్యాలయం ఆవరణలోని గాంధీ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. మీడియా ప్రతినిధులు పాల్గొన్నారు.



మహాత్మా గాంధీ విగ్రహానికి వినతిపత్రం అందజేస్తున్న మేడిపల్లి జర్నలిస్టులు

జర్నలిస్టుల సమస్యలు పరిష్కరించాలి

మేడిపల్లి: మేడిపల్లి మండల ప్రింట్ మీడియా ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో మేడిపల్లి మండల కేంద్రంలో సోమవారం మహాత్మా గాంధీ విగ్రహం వద్ద ఆందోళన చేపట్టి అనంతరం గాంధీజీ విగ్రహానికి వినతి పత్రం అందజేశారు. మేడిపల్లి ప్రింట్ మీడియా అధ్యక్షుడు లెల్లపాటి నరసింహారెడ్డి, సలహాదారుడు వెల్లంకి జయపాల్‌రెడ్డి, గౌరవ అధ్యక్షుడు సంకూరి మురళి, ఉపాధ్యక్షుడు సుదర్శన్, ప్రధాన కార్యదర్శి రవిచంద్ర, కోశాధికారి వెంకటేశ్వర్లు, సభ్యులు డి.రాజిరెడ్డి, సిలివేరు వేణు, జున్ను శ్రీనివాస్ గౌడ్, వర్థెల్లి రవీందర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.